సాక్షి కామారెడ్డి

ఆదివారం । 21 । జూలై । 2024



ఘనత కాంగ్రెస్‌దే

రాష్ట్రంలో రెండుసార్లు పంట రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 8లో ▸



పరిసరాల పరిశుభ్రత..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /22.6

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. రోజంతా వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వ వైద్యుల బదిలీ

కామారెడ్డి టౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు వైద్యులను శనివారం బదిలీ చేశారు. హైదరాబాద్‌లోని పరిషత్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డీసీహెచ్ఎస్‌గా విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్ విజయలక్ష్మిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి బదిలీ చేశారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కళావతి కామారెడ్డి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా రానున్నారు. బాన్సువాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ప్రసాద్‌ను బోధన్ జిల్లా ఆస్పత్రికి బదిలీ చేశారు. కాగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సర్జన్లు శ్రీనివాస్ గౌడ్, కిషోర్ యథాస్థానంలో కొనసాగుతున్నారు.

రేపు విద్యుత్ ప్రజావాణి

కామారెడ్డి అర్బన్: విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రమేశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ సర్కిళ్లు, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ ఆఫీస్‌లు, ఈఆర్‌వోలలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజావాణి ఉంటుందని పేర్కొన్నారు. కామారెడ్డిలోని ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి ఉంటుందని తెలిపారు. విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి'



రాజంపేట: విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు సూచించారు. శనివారం తలమడ్ల ప్రభుత్వోన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి మూడో శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సహపాఠ్య కార్యక్రమాలు నిర్వహించడంలో ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. 'ఇంటింటా చదువుల పంట' యాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, ప్రధానోపాధ్యాయుడు దొమ్మటి భిక్షపతి, మాజీ ఎంపీటీసీ నర్మాల రాజు, వేణుగోపాల శర్మ, కృష్ణచైతన్య, లత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల వేళల మార్పు

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పని వేళలను మారుస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ఇకపై ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు.

మాది ప్రజా ప్రభుత్వం

- అర్హులందరి పంట రుణాలు మాఫీ అవుతాయి
- భిక్కనూరులో రైతు సంబురాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వేదికపై షబ్బీర్ అలీ, కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ

భిక్కనూరు: రాష్ట్రంలో ఉన్నది ప్రజల ప్రభుత్వమని ఎక్సైజ్, సాంస్కృతిక శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఇది రైతుల పక్షపాతి ప్రభుత్వమన్నారు. శనివారం భిక్కనూరులోని రైతు వేదికలో నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో ఆయన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ బంగారు పళ్లెంలో అధికారాన్ని కాంగ్రెస్‌కు అప్పగించామని చెబుతున్న బీఆర్ఎస్ నేతలకు మెదడు సరిగా పనిచేయడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్ ఉండేదని, కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో అభివృద్ధి అంటూ కోట్లాది రూపాయలను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, ప్రజలకు అవసరమైన శాశ్వత పనులను మాత్రం చేపట్టిన పాపాన పోలేదని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో కార్మికుల వేతనాలకు, బ్లీచింగ్ పౌడర్‌కు కూడా నిధులు లేని పరిస్థితిని తెచ్చారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాలను మాఫీ చేస్తున్నామన్నారు. అర్హులైన రైతులందరికీ రూ. 2 లక్షల లోపు పంట రుణం మాఫీ అవుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాణహిత -చేవెళ్ల ప్యాకేజీ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధన్యాత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదులను వారం పదిరోజుల్లో పరిష్కరించాలని, లేకపోతే సరైన సమాధానాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో డీఏవో భాగ్యలక్ష్మి, ఫారెస్టు జిల్లా అధికారి నిఖిత, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి,, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, మాజీ ఎంపీపీలు తోగరి సుదర్శన్, జాంగారి గాలిరెడ్డి, నేతలు ఇంద్రసేనారెడ్డి, నర్సింహారెడ్డి, లింబాద్రి, దయాకర్‌రెడ్డి, వెంకటేశ్, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సంబురాల్లో పాల్గొన్న రైతులు, కాంగ్రెస్ శ్రేణులు

ప్రతి హామీని నెరవేరుస్తాం..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. కరంటు ఇబ్బందులు కలుగుతున్నాయని కొందరు అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు అప్రకటిత కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. వారు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నేతలు

స్త్రీ.. వ్యక్తి కాదు మహాశక్తి

- మహిళా చైతన్యంతోనే ఆదర్శ సమాజ నిర్మాణం
- హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు, వేదికపై జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీ

కామారెడ్డి క్రైం: స్త్రీ అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదని, మహాశక్తి అని హైకోర్టు జడ్జి, కామారెడ్డి అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జే.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయనకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్, అదనపు జిల్లా జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఐసీడీఎస్‌ల ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కళాశాలల విద్యార్థినులకు మహిళా సాధికారతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళా సాధికారత కార్యక్రమానికి హైకోర్టు జడ్జి హాజరు కావడాన్ని హర్షిస్తూ సభికులు ఆడిటోరియంలోని లైట్లు ఆర్పి, సెల్‌ఫోన్ లైట్లు వెలిగించి వినూత్నంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్యవంతమైన మహిళ ఉండే ఇల్లు ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. అందరి ఇళ్లు ఆదర్శవంతంగా ఉంటే దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన రాజ్యాంగం పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. మహిళల రక్షణ కోసం గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, పోక్సో చట్టం తదితర చట్టాలున్నాయన్నారు. గతంలో ఏవైనా సమస్యలుంటే కుల సంఘాలు, గ్రామ పెద్దలు పరిష్కరించేవారన్నారు. పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల వరకు కేసులు ఎక్కువగా వచ్చేవి కావన్నారు. కానీ ఇప్పుడు వందేళ్లు పని చేస్తే తప్ప పరిష్కారం కానన్ని కేసులు కోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 1987లో న్యాయ సేవ సాధికార సంస్థ చట్టాలను తీసుకువచ్చారని, మండల, జిల్లా స్థాయి న్యాయ సేవ సాధికార సంస్థకు ఫిర్యాదు చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. విద్యార్థి జీవితం చాలా విలువైందని, సెల్‌ఫోన్‌లకు బానిస కావద్దని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తన స్వగ్రామం కామారెడ్డి జిల్లా సరిహద్దుల్లోని లింగన్నపేట అన్నారు. తాను విద్యార్థి దశలో ఉన్నప్పుడు కామారెడ్డి పట్టణం విద్య, వైద్యం, వ్యాపార రంగాలలో ఉన్నతంగా ఉండడాన్ని గమనించానని గుర్తు చేసుకున్నారు.

అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలువురికి మంజూరైన ఆర్థిక చేయూత చెక్కులు, ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన చట్టాల పోస్టర్లను ఆవిష్కరించారు.



వినూత్నంగా స్వాగతం పలుకుతున్న సభికులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న హైకోర్టు జడ్జి

ముసురేసింది..

- జిల్లా అంతటా కురుస్తున్న వాన
- వ్యవసాయ పనుల్లో కదలిక

సాక్షి, కామారెడ్డి : వానాకాలం సీజన్ మొదలై నెలన్నర కాలం గడిచినా సరైన వర్షాలు లేక ఇబ్బందులు పడిన రైతాంగం రెండు రోజులుగా కురుస్తున్న జల్లులతో కొంత ఊరట చెందింది. శనివారం జిల్లా అంతటా ముసురు పెట్టింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. తెరిపిలేకుండా చిరుజల్లులు కురుస్తుండడంతో రోడ్లు చిత్తడిగా మారాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌లో అత్యధికంగా 22.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వరినాట్లు ముమ్మరం

రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండడంతో పాటు ముసురు పట్టడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. అదను దాటుతుండడంతో వరి నాట్లు ముమ్మరం చేశారు. నిన్న మొన్నటిదాకా ఆకాశంవైపు చూసిన రైతులు.. జల్లులు కురుస్తుండడంతో వర్షపునీరు, బోరుబావుల ఆధారంగా నాట్లు వేస్తున్నారు. జిల్లా అంతటా వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి.

వర్షానికి కూలిన ఇల్లు



దేవునిపల్లిలో పాక్షికంగా ధ్వంసమైన ఇల్లు

కామారెడ్డి రూరల్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి దేవునిపల్లికి చెందిన చిందం కుమార్ అనే వ్యక్తి ఇల్లు శనివారం పాక్షికంగా కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వాగులో వరద ప్రవాహం

నిజాంసాగర్: మండలంలో రెండు రోజుల నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో కాలువలు, ఒర్రెలలో జలకళ కనిపిస్తోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు సింగితం వాగులో వరద నీటి ప్రవాహం నెలకొంది. దీంతో సింగితం, శేర్‌ఖాన్‌పల్లి గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సింగితం వాగులో ప్రవహిస్తున్న వరద నీరు

జిల్లాలో శనివారం నమోదైన వర్షపాతం వివరాలు.. (మి.మీ.)

మండలం	వర్షపాతం						
		మగ్గుంపూర్	15.0	పుల్కల్	13.0	పాతరాజంపేట	11.0
మాచాపూర్	22.8	అర్గొండ	14.8	బిచ్కుంద	13.0	లచ్చాపేట	11.0
పిట్లం	19.8	డోంగ్లీ	14.8	లింగంపేట	13.0	వెల్పుగొండ	10.8
హసన్‌పల్లి	18.3	భిక్కనూరు	14.8	జుక్కల్	12.5	దోమకొండ	10.0
బీర్కూర్	16.5	బొమ్మదేవ్‌పల్లి	14.5	మేనూర్	12.3	బీబీపేట	8.5
కొల్లూరు	16.3	నాగిరెడ్డిపేట	14 .0	రామలక్ష్మణ్‌పల్లి	12.3	పెద్దకొడప్‌గల్	7.8
నస్రుల్లాబాద్	15.5	కామారెడ్డి	13.3	సోమూర్	11.8	సదాశివనగర్	5.0
గాంధారి	15.5	తాడ్వాయి	13.3	ఇసాయిపేట	11.3	రామారెడ్డి	2.3

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- జీజీహెచ్‌నుంచి ఎత్తుకెళ్లిన దుండగులు
- ప్రత్యేక బృందాలతో గాలింపు
- 16 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- మెట్‌పల్లిలో బాలుడు, నిందితులను అదుపులోకి తీసుకున్న బృందాలు
- జిల్లాలో కలకలం రేపిన ఘటన

నిజామాబాద్‌నాగారం/ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. ఓ వ్యక్తి తన భార్యకు అబార్షన్ చేయించేందుకు ఆస్పత్రికి రాగా కుమారుడితో కలిసి హాల్‌లో నిద్రించాడు. శనివారం తెల్లవారు జామున ఇద్దరు దుండగులు బాలుడిని ఎత్తుకెళ్లారు. కుమారుడు కనిపించకపోవడంతో తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఒకటో టౌన్ పోలీసులు రంగంలోకి దిగి 16 గంటల్లో కిడ్నాప్ కథను సుఖాంతం చేశారు.

జరిగింది ఇలా..

నగరంలోని మానిక్‌భండార్‌కు చెందిన సాయినాథ్ తన భార్య స్రవంతికి అబార్షన్ చేయించడానికి శుక్రవారం జీజీహెచ్‌కు తీసుకువచ్చాడు. రాత్రి పూట తన మూడేళ్ల కుమారుడు అరుణ్‌కుమార్‌తో కలిసి



అరుణ్‌కుమార్

వెయిటింగ్ హాల్ వద్ద నిద్రించగా.. ఇద్దరు దుండగులు బాలుడిని ఎత్తుకెళ్లారు. తన భార్య వచ్చి భర్త సాయినాథ్‌ను లేపి కొడుకు అరుణ్‌కుమార్ ఎక్కడా ఆరా తీసింది. బాబు కనిపించకపోవడంతో సెక్యూరిటీ అక్కడే ఉన్న పోలీస్ సిబ్బందికి చెప్పి వెతికించినా జాడ కనిపించలేదు. దీంతో నిజామాబాద్ ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ ప్రారంభించిన పోలీసులు జీజీహెచ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లినట్లు రికార్డయ్యింది. ఒకటోటౌన్ సీఐ ఆధ్వర్యంలో మూడు బృందాలు విచారణ చేపట్టాయి. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి, నిందితులను నగరానికి చెందిన వారీగా గుర్తించారు. సాంకేతిక సహాయంతో వారు నిందితులు మెట్‌పల్లికి వెళ్లినట్లు కనుగొన్నారు. వెంటనే బృందం సభ్యులు వెళ్లి సాయంత్రం 7 గంటల సమయంలో బాలుడిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలుడి అపహరణ కథ సుఖాంతమైంది.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత పేర్కొన్నారు. పట్టణంలో పారిశుధ్యం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్‌తో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 'సాక్షి' ఫోన్ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గంట సమయంలో 30 కాల్స్ రాగా.. కమిషనర్ ఓపికగా ప్రజల సమస్యలను విని నోట్ చేసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రశ్న: మా కాలనీలలోని ఓపెన్ ప్లాట్లలో ముళ్ల చెట్లు పెరిగాయి. దీంతో అడవి పందులు వస్తున్నాయి. వీటికి తోడు వీధి కుక్కలు కూడా భయపెడుతున్నాయి. వైద్య కళాశాల హాస్టల్‌లో మిగిలిపోయిన ఆహార వ్యర్థాలను పడేస్తుండడంతో పందులతోనూ ఇబ్బందిగా ఉంది. – విజయ్‌కుమార్, వెంకటేశం, రామ్మోహన్, పూర్ణచందర్‌రావు, హరిహర, శ్రీనివాస్‌నగర్ కాలనీల వాసులు

కమిషనర్: అధికారులను పంపించి చర్యలు తీసుకుంటాను. ఓపెన్ ప్లాట్లలో ముళ్ల చెట్లను తొలగిస్తాం. సాయంత్రం పూట ప్రత్యేక బృందంతో కుక్కలను పట్టిస్తాం.

■ టీచర్స్‌కాలనీలో నీటి కొరత తీవ్రంగా ఉంది. పైప్‌లైన్ వేయాలి. – సునీల్, సందీప్, వెంకటరమణ, జగన్‌రెడ్డి, అనిల్‌కుమార్

✤ నీటి ఎద్దడి నివారణ కోసం పైప్‌లైన్లు లేని వార్డుల్లో అమృత్ పథకం కింద పైప్‌లైన్లు వేయడానికి చర్యలు తీసుకుంటాం.

■ వార్డులవారీగా ప్రజావాణి నిర్వహించాలి. సెప్టిక్ ట్యాంకులు లేకుండా మరుగుదొడ్లు వాడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి. – కె.సాయిలు, టేక్రియాల్

✤ సెప్టిక్ ట్యాంకులు లేకుండా మరుగుదొడ్లు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. పట్టణ ప్రజలకు ఏవైనా సమస్యలుంటే నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు.

■ కొత్త బస్టాండ్ పక్కనున్న లాడ్జి వద్ద 80 ఫీట్ల రోడ్డు కబ్జా అయ్యింది. రోడ్డుకు ఇరువైపులా కర్రీ పాయింట్లు, టిఫిన్ సెంటర్లతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే మురికి కాల్వలు లేకపోవడంతో రోడ్లపైకి నీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నాం. – జంగం నరేష్, పట్టణవాసి

✤ ఆయా అంశాలు నా దృష్టికి వచ్చాయి. చర్యలు తీసుకుంటాం.

■ 14వ వార్డులో బజాజ్ షో రూం సమీపంలో రోడ్డును అక్రమించి ఓ భవనానికి మెట్లు నిర్మించారు. –సతీశ్ కుమార్, పట్టణవాసి

✤ వెంటనే పరిశీలిస్తాం. మెట్లు నిర్మించి ఉంటే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

■ కొత్తబస్టాండ్ వద్ద కంపు భరించలేకపోతున్నాం. – శ్రీధర్, పట్టణవాసి

✤ బస్టాండ్ వద్ద మురికికాల్వలపై మ్యాన్‌హోల్స్ లేనందున ఇబ్బందులు వస్తున్నాయి. ఐదు మీటర్లకు ఒకటి చొప్పున మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసి పూడిక తీయిస్తాం.

■ డెయిలీ మార్కెట్‌ను శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. సుభాష్‌రోడ్డులో రోడ్డుపైనే కూరగాయలు అమ్ముతుండడంతో ట్రాఫిక్ ఇబ్బంది ఉంది. – టి.మోహన్, బాలు

✤ డెయిలీ మార్కెట్‌లో రోజూ రాత్రి పూట పారిశుధ్య పనులు చేస్తారు. ఇంకా సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను.

■ 22వ వార్డు డబుల్ బెడ్ రూం కాలనీ వద్ద 6 నెలలుగా మురికి కాలువలను శుభ్రం చేయడం లేదు. ఎండీ ఫయాజ్

✤ డ్రైయినేజీలను శుభ్రం చేయిస్తాం.

■ పట్టణంలోని 16వ వార్డులోని సీసీ రోడ్డులో నాణ్యతలోపంతో రోడ్డుపై నీళ్లు నిలుస్తున్నాయి. రామేశ్వరపల్లి ముత్యాలమ్మ ఆలయ ప్రాంతంలో, అశోక్‌నగర్ పాత ఎస్‌పీఆర్ స్కూల్ సమీపంలో, గాంధీనగర్ దుర్గాకాలనీలో మురికికాల్వలు లేవు. రామేశ్వరపల్లి డబుల్‌బెడ్ రూం కాలనీకి చెత్త బండి రావడంలేదు. – మోహన్‌రెడ్డి, సుజిత్‌కుమార్, సాయిలు, మల్లికార్జున్, జనార్దన్, నాగరాజు

✤ నిధులు రాగానే అవసరమైన చోట మురికికాల్వలు నిర్మిస్తాం. చెత్త బండి అన్ని ప్రాంతాలకు వచ్చేట్లు చర్యలు తీసుకుంటాం.



■ అశోక్‌నగర్‌కాలనీలోని బంగారు మైసమ్మ వద్ద రోడ్డుపై నీరు నిలుస్తుండడంతో ఇబ్బంది పడుతున్నాం. –గంగాధర్, విజయ్‌కుమార్

✤ నీరు నిలువకుండా చూస్తాం.

సాక్షి ఫోన్ ఇన్

■ కరెంట్ బిల్లు ఇచ్చినట్లు ఆస్తిపన్ను చెల్లింపు రసీదులు ఇస్తున్నారు. ఈ ప్రింట్ కొద్ది రోజుల్లోనే వెలిసిపోతోంది. – అనిల్‌కుమార్

✤ ప్రభుత్వం బిల్లు మిషన్లు ఇచ్చింది. వాటి ద్వారానే బిల్లులు వసూలు చేయాలి. బిల్లును జిరాక్స్ తీసుకుని భద్రపరచుకోండి. వార్డుల వారీగా బిల్ కలెక్టర్లున్నారు. ఫోన్ చేస్తే వారే ఇంటికి వచ్చి బిల్లు తీసుకుంటారు.



అశోక్‌నగర్ కాలనీలో రోడ్డుపై నీరు నిలవకుండా డ్రైయినేజీని శుభ్రం చేయిస్తున్న కమిషనర్

క్లుప్తంగా

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 34 రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కామారెడ్డి ఆర్డీవో రంగనాథచారి తెలిపారు. డివిజన్ పరిధిలోని భిక్కనూరు, దోమకొండ, కామారెడ్డి పట్టణం, కామారెడ్డి మండలం, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. రాత పరీక్ష ద్వారా, ఇంటర్వ్యూ ద్వారా డీలర్లను ఎంపిక చేస్తామని, ఈనెల 20 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు ఆర్డీవో కార్యాలయంలో చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నియామకం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులను నిర్వర్తిస్తున్న అనిల్‌కుమార్ రాష్ట్ర పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు సందీప్ తెలిపారు.

సౌత్‌క్యాంపస్ విద్యార్థి రమేశ్‌కు డాక్టరేట్



భిక్కనూరు : తెయూ సౌత్‌క్యాంపస్ సోషల్ వర్క్స్ విభాగంలో పరిశోధన చేసిన గాంధీరి కర్ రమేష్‌కు శనివారం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. తెలంగాణ యునివర్సిటీ సోషల్ వర్స్క్ డిపార్ట్‌మెంట్ పరిశోధక విద్యార్థి రమేష్, అధ్యాపకురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఉత్తర తెలంగాణలో సంగర (మోచీ) కమ్యూనిటీలో మారుతున్న జీవనోపాధి పరిస్థితులపై అధ్యయనం చేసి పరిశోధక గ్రంథాన్ని సమర్పించారు. ఈసందర్భంగా ఆయనకు డాక్టరేట్ పట్టాను శనివారం సౌత్‌క్యాంపస్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్‌వర్క్స్ విభాగం అధ్యాపకులు వీరభద్రం, విజయ్‌కుమార్ శర్మ, అంజయ్య, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, డాక్టరేట్ అసోసియేట్ ప్రతినిధులు సంతోష్‌గౌడ్, వంగ రాహుల్‌నేత, నరేందర్ రెడ్డి, సత్యం, పీహెచ్‌డీ విద్యార్థులు బాలమణి, అరుణ్ పాల్గొని అభినందించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో కూడళ్లు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సదాశివ నగర్ సీఐ సంతోష్ అన్నారు. శనివారం ఆయన ఎస్సై ఆంజనేయులుతో కలిసి మండల కేంద్రంలో బృందావన్ ఫంక్షన్ హాల్‌లో వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు యువకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీసీ కెమెరాల వినియోగం, ఉపయోగాలు, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. యువకులు మారక ద్రవ్యాల జోలికిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవు, మాజీ ఎంపీటీసీ తూర్పు రాజు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

రెండుసార్లు రుణమాఫీ కాంగ్రెస్ ఘనతే

- ఏకకాలంలో రూ. 31 వేల కోట్ల రుణమాఫీ
- ప్రాణహిత–చేవెళ్ల 22వ ప్యాకేజీ పనులు త్వరలోనే పూర్తి
- నెల రోజుల్లో దోమకొండలో 100 పడకల ఆస్పత్రి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



దోమకొండలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

దోమకొండ : దేశ చరిత్రలో రెండుసార్లు రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రుణమాఫీ సంబురాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అనంతరం రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏకకాలంలో రైతులకు రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ చేశామని, తిరిగి మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారన్నారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ వరంగల్ సభలో రుణమాఫీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

వైఎస్సార్ హయాంలో..

వైఎస్సార్ సీఎం ఉన్న హయాంలో ప్రాణహిత చేవేళ్ల పథకం తీసుకొచ్చానన్నారు. దాదాపు 3 లక్షల పైచిలుకు భూములకు సాగునీటిని దీనిద్వారా అందించవచ్చన్నారు. చెరువులు నిండి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పథకాన్ని పట్టించుకోలేదన్నారు. తిరిగి దానిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పీఎం మోదీ ప్రతిపేదల అకౌంట్లలో 15లక్షలు వేస్తానని చెప్పి రూ. 15 వేలు కూడా వేయలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు.

దోమకొండలో..

దోమకొండలో తన హయాంలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించామన్నారు. దానిని తిరిగి మరోనెల రోజుల్లో 100 పడకల ఆస్పత్రిగా మారుస్తామన్నారు. దోమకొండ సబ్‌స్టేషన్‌లో లోడ్ పెరిగి కరెంట్ కోతలు వస్తున్నాయన్నారు. రెండు నెలల్లో మాచారెడ్డిలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా నాయకులు తిర్మల్‌గౌడ్, అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఐరేని నర్సయ్య, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, రామస్వామిగౌడ్ తదితరులున్నారు.

‘ఉపాధి’లో నిధులు దుర్వినియోగం

- మారని ఫీల్డ్ అసిస్టెంట్ల తీరు
- ఉద్యోగులపై అధికారుల ఆగ్రహం



రాజంపేటలో ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

రాజంపేట : రాజంపేట మండలంలోని రైతు వేదిక భవనంలో శనివారం 18 గ్రామ పంచాయతీలకి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద గత సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. ఈనెల 12 నుండి 18 వరకు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి జరిగిన పనులపై సంబంధిత డీఆర్‌పీ అధికారులు వివరాలు సేకరించి ప్రజావేదికలో చదవి వినిపించారు. పలు గ్రామాల్లో ఉపాధిహామీలో ఒకరి పేరుపై మరొకరు పనులు చేసినట్లు మాస్టర్లలో హాజరు వేశారు. మాస్టర్లలో బయటి దేశంలో ఉన్న వారికి, ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారికి సైతం పనులు చేసినట్లు హాజరు చూపించారు. ఈ తనిఖీల్లో గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. దీంతో ఆడిట్ అధికారులు, ఉన్నతాధికారులు సంబంధిత టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వామన్‌రావ్, ఎంపీడీవో రాజేశం, ఏపీఓ సక్కుబాయి, సోషల్ ఆడిట్ ఏవో ప్రశాంత్, అంబుడ్స్ మ్యాన్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ట్యాంకర్ చోరీ కేసులో ఒకరి రిమాండ్



రాజయ్య అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడి రైతువేదిక వద్ద జరిగిన వాటర్ ట్యాంకర్ చోరీ కేసులో ఒకరిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. బీబీపేట్ మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తంగెల్లపల్లి చాకలిరాజయ్య అనేవ్యక్తి రెండేళ్ల క్రితం ట్రాక్టర్‌రు కొని మండలంలో దుక్కులు దున్నుతున్నాడు. కాగా గ్రామంలో పనిలేక హైదరాబాద్‌లోని పటాన్ చెరువువద్ద కొత్త చెరువు నిర్మాణం పనులకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడన్నారు. అయితే చిట్యాలలో ఎక్కువ పని ఉందని తెలియడంతో రమేశ్ అనే వ్యక్తికి రాజయ్య ట్రాక్టర్‌ను లీజుకు ఇచ్చాడన్నారు. ఇలా రోజూ వచ్చీపోయే క్రమంలో కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఉన్న రైతు వేదిక వద్ద కృష్ణాజీవాడి జీపీకి చెందిన ట్రాక్టర్ కనిపించగా ఈ ట్రాక్టర్‌తో హైదరాబాద్‌లో మరిన్ని డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో ఈనెల 7న తన ట్రాక్టర్‌తో ట్యాంకర్‌ను రాజయ్య చోరీ చేశాడన్నారు. సీసీ పుటేజీ, కాల్‌డేటా ఆధారంగా రాజయ్యను పట్టుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవులు, కానిస్టేబుల్ తదితరులున్నారు.

గిరిజన మహిళకు పాము కాటు



పాముకాటుకు గురైన మహిళకు 108లో చికిత్స అందిస్తున్న సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని కొయ్యగుండుతండాకు చెందిన జీరి అనే గిరిజన మహిళను శనివారం పాము కాటేసినట్లు తండావాసులు తెలిపారు. పాముకాటు వేసిన వెంటనే కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది తండాకు చేరుకొని మహిళకు ప్రథమ చికిత్స నిర్వహించి కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళ చికిత్స పొందుతోంది. వైద్యులు ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు. సమయానికి స్పందించిన 108 సిబ్బందికి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కాలభైరవుడి సేవలో హైకోర్టు జడ్జి

రామారెడ్డి : ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీకాలభైరవుడిని తెలంగాణ హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన హైకోర్టు జడ్జి శ్రీనివాసరావుకు వేద పండితులు ఆలయ ఈవో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి గర్భగుడిలో హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో ప్రభుగుప్తా, అర్చకులు శ్రీనివాసశర్మ స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కోర్టు జడ్జి శ్రీత, పాల్గొన్నారు.

మున్నూరుకాపు ట్రస్ట్ ఆధ్వర్యంలో పురస్కారాలు

కామారెడ్డి అర్బన్ : మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ధర్మకర్తల సంస్థ ద్వారా 2023–24కు గాను ప్రతిభ ఉన్న ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎంఆర్ వెంకట్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 31లోగా కాచిగూడలోని మున్నూరుకాపు వసతి గృహంలో అందజేయాలని, వివరాలకు 040–24658160, 9491627404లో సంప్రదించాలన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జికి సన్మానం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనురాధాగౌడ్ శనివారం రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి దీపాదాస్ మున్షి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన అనురాధాగౌడ్ కాంగ్రెస్ నాయకులను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక చేయూత

కామారెడ్డి క్రైం : సీఎం సహాయనిధి పథకం ద్వారా ఎంతోమంది నిరుపేదలకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 35 మందికి మంజూరైన సహాయనిధి చెక్కులను శనివారం జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 35 మందికి మొదటి విడతగా చెక్కులు వచ్చాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల పాలై డబ్బులు ఖర్చు చేసుకున్న నిరుపేదలు ఎవరైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా క్యాంప్ కార్యాలయంలో సంబంధిత పత్రాలు అందజేయాలన్నారు. ఇకమీదట వచ్చే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండలాల వారీగా ఆయా మండల కేంద్రాల్లోనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

మురికి కాల్వలో పూడిక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



లింగంపేట సొసైటీ వద్ద మురికి కాల్వ పూడిక తొలగించి వెడల్పు చేయిస్తున్న డీపీవో వెంకటేశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సొసైటీ వద్ద మురికి కాల్వ పూడిక పేరుకు పోయి దుర్వాసన వస్తుండడంతో గురువారం 18 తేదీన ‘లింగంపేటలో డెంగీ బెల్స్’ శీర్షికతో కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశం, లింగంపేట కార్యదర్శి శ్రవణ్‌కుమార్ శనివారం జేసీబీతో సదరు మురికి కాల్వ నుంచి చెత్తా చెదారం, పూడికను తొలగింపజేశారు. కొన్నిరోజులులో లింగంపేటలో జ్వరపీడితులు పెరుగుతుండడంతో ఇంటింటికీ వెళ్లి అధికారులు సర్వే చేస్తున్నారు. వైద్యం అందిస్తున్నారు. పారిశుధ్యలోపమే కారణంగా భావిస్తున్న అధికారులు దానికనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో ప్లాట్ విక్రయం.. అరెస్ట్



నిందితులు శ్రీనివాస్, గంగాధర్

కామారెడ్డి క్రైం: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వేరే వ్యక్తి ప్లాట్‌ను విక్రయించిన ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన కలిమెళ్ల రాజయ్య పట్టణంలోని గాంధీనగర్‌లో 200 గజాల ప్లాటును 2002లో కొనుగోలు చేశాడు. కొద్ది రోజుల తర్వాత అతడు అనారోగ్యంతో చనిపోగా, వీక్లీ మార్కెట్ ప్రాంతంలో నివాసం ఉండే మార శ్రీనివాస్ ఆ ప్లాట్‌పై కన్నేశాడు. నకిలీ పత్రాలు సృష్టించిన శ్రీనివాస్.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాయంలో మృతుడి కుమారుడిగా ఆరేటి గంగాధర్‌ను చూయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తరువాత ప్లాట్‌ను మరో వ్యక్తికి విక్రయించాడు. అయితే, తమ ప్లాట్‌లో వేరే వారు కబ్జా ఉండటాన్ని గమనించిన రాజయ్య కుమారుడు మహేందర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, గంగాధర్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

బస్సులో తల్లీకూతుళ్ల చేతివాటం

- కండక్టర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికుల డబ్బులు చోరీ
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

భిక్కనూరు: ఆర్టీసీ బస్సులో తమ చేతివాటాన్ని ప్రదర్శించిన తల్లీకూతుళ్లు కండక్టర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికల డబ్బులను కొట్టేశారు. ఈ ఘటన భిక్కనూరులో శుక్రవారం అర్ధరాత్రి రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఆర్మూర్ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి వస్తుండగా భిక్కనూరు బస్టాండు వద్ద కండక్టర్ రాచర్ల నారాయణ తన వద్ద జేబులో పెట్టుకున్న రూ.6,640 కనిపించడం లేదని కేకలు వేశాడు. ఆవెంటనే మరో ఇద్దరు ప్రయాణికులు తమ రూ.8,500 కనిపించడం లేదని తెలిపారు. జంగంపల్లి శివారులో బస్సును నిలిపి వేయించిన కండక్టర్.. డయల్ 100కు ఫిర్యాదు చేయగా, ఘటనాస్థలానికి భిక్కనూరు పోలీసులు చేరుకొని ప్రతి ఒక్కరినీ తనిఖీ చేశారు. దీంతో బస్సులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన తల్లీకూతుళ్లు బొంతల లక్ష్మి, కవిత వద్ద రూ.15వేల నగదు పట్టుబడింది. పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, బస్సులో చోరీకి పాల్పడిన తల్లీకూతుళ్లు వారం రోజుల క్రితం కామారెడ్డికి వచ్చి ఇంటిని అద్దెకు తీసుకున్నారని, అక్కడే ఉంటూ చోరీకి పాల్పడుతున్నారని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహదారు షబ్బీర్‌అలీ పాల్గొనగా, ఇదే అదునుగా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం అనంతరం మండల కాంగ్రెస్ కార్యాలయాన్ని షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఇదే సమయంలో సంఘమేశ్వర్ మాజీ సర్పంచ్ జెట్టబోయిన నరేశ్‌కు చెందిన రూ.2వేలు, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్‌కి చెందిన రూ.5వేలు, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డికి చెందిన రూ.5వేలు, గొట్టిముక్కల గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డికి చెందిన రూ.10వేలతో పాటు మరో ఇద్దరికి చెందిన డబ్బులు చోరీకి గురయ్యాయి. కార్యక్రమం పూర్తయిన తరువాత తమ డబ్బులు చోరీకి గురైనట్లు గుర్తించిన నాయకులు విస్తుపోయారు. గతంలో సైతం పలు కార్యక్రమాల్లో ఇదే విధంగా డబ్బులు చోరీ అయ్యాయని వారు తెలిపారు.

క్రైం కార్నర్

బహ్రెయిన్‌లో మెండోరా వాసి మృతి

- మృతదేహాన్ని తెప్పించాలని భార్యాపిల్లల వేడుకోలు



మాకూరి వినోద్(ఫైల్)



వినోద్ భార్యాపిల్లలు

బాల్కొండ: బతుకుదెరువు కోసం భార్యాపిల్లలను వదిలి బహ్రెయిన్‌కు వెళ్లిన మెండోరా మండల కేంద్రానికి చెందిన మాకూరి వినోద్(35) అక్కడ జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. పైపులైన్ కందకం తవ్వకం పనులు చేస్తుండగా కందకం కూలడంతో వినోద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు నాలుగు రోజుల తరువాత కుటుంబ సభ్యులకు శనివారం సమాచారం అందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తన భర్త మృతదేహన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య యమున వేడుకుంటోంది.

నాలుగేళ్ల క్రితం వెళ్లి..

కుటుంబాన్ని వదిలి నాలుగేళ్ల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లిన వినోద్.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేక పోవడంతో కనీసం సెలవుపై కూడా రాలేదు. బహ్రెయిన్‌లో ఆజాద్ వీసాపై పని చేస్తున్న వినోద్ మృతి చెందగా, ఏ కంపెనీ పట్టించుకోవడం లేదని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. మృతుడికి భార్య యమున, కుమార్తె అక్షిత, కుమారుడు అర్వింద్ ఉన్నారు.

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి



జంగం గోపి (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మన్‌పల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ జంగం గోపి(38)శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. గోపి గత ఐదేళ్లుగా గ్రామ పంచాయతీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో గోపికి గుండెపోటు వచ్చింది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. అంత్యక్రియలకు మాజీ సర్పంచ్ లతాదేవరాజ్, ఎంపీడీవో సతీశ్‌కుమార్, జీపీ కార్యదర్శి హరీశ్, సిబ్బంది హాజరయ్యారు. జీపీ తరఫున రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: కుటుంబ కలహాల కారణంగా నగరంలోని ముజాహిద్‌నగర్‌కు చెందిన ఎజాజ్(38) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ శనివారం తెలిపారు. ఎజాజ్ తరచూ భార్యతో గొడవ పడుతుండడంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పుట్టింటికి ఆమె చేరకపోవడంతో ఆమెర తరపు బంధువులు ఎజాజ్‌ను నిలదీశారు. విడాకులు చేస్తామని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఎజాజ్ శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని రైతు..



రమావత్ దేవ్లా (ఫైల్)

రాజంపేట: కేజీవీల్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా వెనక్కి నడిపి ఢీకొట్టిన ఘటనలో మండలంలోని శంకర్‌తండాకు చెందిన రైతు రమావత్ దేవ్లా (61) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన దేవ్లాకు 10 గుంటల వ్యవసాయభూమి ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో పక్కనే ఉన్న కాత్రోత్ వాచ్చ అనే రైతు భూమిలో నుంచి నీటిని వాడుకునేందుకు అనుమతి తీసుకున్నాడు. శనివారం ఉదయం 11గంటలకు తన పొలానికి నీరు పెట్టేందుకు కాత్రోత్ వాచ్చ పొలంలోని పైపుగేట్‌వాల్‌ను దేవ్లా తిప్పుతున్నాడు. అదే సమయంలో కాత్రోత్ వాచ్చ చిన్న కుమారుడు రాములు కేజీవీలు ట్రాక్టర్‌తో పని చేస్తూ అజాగ్రత్తగా వెనక్కి తీసుకురావడంతో దేవ్లాను ఢీకొన్నది. గాయాలపాలైన దేవ్లాను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వ్యక్తిపై దాడి



గాయాలపాలైన కర్నె మహేందర్

భీమ్‌గల్: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వ్యక్తిపై రాళ్లతో దాడి చేసిన ఘటన మండలంలోని బెజ్జోరా గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేశ్(బీఆర్‌ఎస్)తోపాటు మరికొందరు ముచ్కూర్ గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై శుక్రవారం అర్ధరాత్రి తిరిగి వస్తుండగా బెజ్జోరా గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించాయి. వెంటనే ట్రాక్టర్లను అడ్డుకోగా, ఆగ్రహానికి గురైన ఇసుక వ్యాపారులు వారిపై దాడి చేయగా అందరూ తప్పించుకున్నారు. ఇసుక వ్యాపారులైన పిట్ల రాజు, శ్రీరాం రవికి బీఆర్‌ఎస్ కార్యకర్త మహేందర్ చిక్కగా భాస్కర్ అనే వ్యక్తి రాళ్లతో దాడి చేశాడు. మహేందర్ స్పృహ కోల్పోవడంతో దాడిచేసిన వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఘటనాస్థలానికి చేరుకున్న స్నేహితులు గాయాలపాలైన మహేందర్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తహసీల్దార్ శ్రీలతకు ఇసుక అక్రమరవాణాపై పలుమార్లు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందాయని పలువురు పేర్కొంటున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని ఖాజాపూర్‌లో చాకలి సౌజన్య అనే మహిళ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారని రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. సౌజన్యం శుక్రవారం ఇంటికి తలం వేసి పొలం పనులకు వెళ్లిందని, సాయంత్రం తిరిగి వచ్చేసరికి చోరీ జరిగిందన్నారు. ఇంట్లో దాచిన మూడు తులాల బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు దుకాణాల్లో ..

కామారెడ్డి క్రైం : కామారెడ్డి మున్సిపల్ పరిధి లోని తాళం వేసి ఉన్న మూడు దుకాణాల్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. దేవునిపల్లిలో నివాసం ఉండే కాటిపల్లి శ్రీకాంత్ స్థానికంగా ఓ ట్రేడర్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం షాప్‌కు వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించాడు. దుకాణం పైభాగంలో ఉన్న రేకులను తొలగించి లోనికి చొరబడినట్లు తెలుస్తుంది. అతనితో పక్కనే ఉన్న మరో రెండు దుకాణాల్లోనూ ఇదే తరహాలో దొంగలు పడ్డారు. శ్రీకాంత్ దుకాణంలోని కౌంటర్ నుంచి రూ. 3 వేల నగదు, సెల్‌ఫోన్ అపహరణకు గురయ్యాయి. దేవునిపల్లి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్ వైరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ వైరును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే మాకం రాములు ఫామ్‌హౌస్ తాళాలను పగులగొట్టి సోలార్ బ్యాటరీ, కేబుళ్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారన్నారు. ఈ ఘటనపై రాములు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.